క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



మానవపాడు: మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన డీసీసీ సెక్రెటరీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం కేజీబీవీలో బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. కేజీబీవీ పాఠశాలకు సంబంధించి అదనపు గదులు కావాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎస్‌ఓ అనురాధ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సింధు, సూపర్‌వైజర్ చంద్రన్న, మాజీ సర్పంచ్ రవి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

అయిజ: మండలంలోని కొత్తపల్లిలో నిర్మించనున్న చర్చికి సంకాపురం రాముడు రూ.50 వేలు విరాళం అందజేశారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కొత్తపల్లి గ్రామస్తులు సంకాపురం రాముడిని కలిసి చర్చికి విరాళం ఇవ్వాలని కోరారు. దీంతో స్పందించిన రాముడు చర్చి నిర్మాణానికి ఆర్థికసాయం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



గద్వాల అర్బన్: 11కేవీ ఫీడర్–2 పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ చార్జ్ చేయడం, ఫీడర్ మరమ్మతు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ శివకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, చెనుగోనిపల్లి రోడ్డు, బుర్దపేట, గంట వీధి, గాంధీచౌక్, కృష్ణారెడ్డి బంగ్లా, సుంకులమ్మ మెట్టు, శేరెల్లి వీధి కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

రాజోళి: మండలంలోని పచ్చర్ల గ్రామంలో ఎల్లమ్మ గుడి నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజలు, ప్రత్యేక హోమాలు చేశారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రతిష్ఠ అనంతరం గ్రామంలో ఆడపడుచులకు సారె పోసి పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. గ్రామంలో పంటలు పండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

సామాజిక తనిఖీ

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో గురువారం ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలో సామాజిక తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి

మల్దకల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండేందుకే ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జీహెచ్‌ఎం నరేష్ కోరారు. గురువారం అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం మత్తు పదార్థాల వాడకం వలన కలిగే దుష్ఫలితాలపై కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్షితుడు, అనిత, ధనుంజయ, రుషిరాజు, ఆనంద్, రవి, సరిత, అరుణరాణి, వీరన్న, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారం చోరీ

గట్టు: మండలంలోని పెంచికలపాడులో బుధవారం బోయ నర్సింహులు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బోయ నర్సింహులు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. అయితే ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మూడున్నర తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఇంటి తలుపు తెరచి ఉండడం చూసి ఆందోళన చెందారు. ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు ఇంట్లో దాచిన మూడున్నర తులాల బంగారం చోరీకి గురైనట్లుగా బాధితులు గట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



నందిన్నెలో..



మానవపాడు కేజీబీవీలో..



మేడికొండలో..

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



పుల్లూరు గురుకుల పాఠశాలలో..



మల్దకల్‌లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్

సాక్షి, నెట్‌వర్క్: బాలలే రేపటి దేశ భవిష్యత్ అని, వారిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులు, పలువురు వక్తలు అన్నారు. గురువారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, క్విజ్ పోటీలు నిర్వహించి, ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అయిజ మండలంలోని ఉప్పల క్యాంప్ గ్రామంలో 1988–89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, టై, బెల్టులు వితరణ చేశారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో..



రామాపురంలో..



అలంపూర్ చౌరస్తాలో విద్యార్థులు

ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి

ధరూరు: కార్మికులంతా సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్మిక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక వర్గానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఎంవీ యాక్ట్ 2020 తీసుకొచ్చి రవాణా రంగ కార్మికులను ప్రమాదాలకు బాధ్యులు చేస్తూ వారి కుటుంబాలను రోడ్డున పడేస్తోందని వివరించారు. సంపద సృష్టికి మూలమైన కార్మిక వర్గానికి సంపద ఫలాలు దక్కకుండా కుట్రలు చేస్తున్నాయని వాపోయారు. పోరాడి సాధించుకున్న హక్కులను హరించే విధంగా చట్టాలను తారుమారు చేస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. మండలంలో కొందరు ఏఎన్‌ఎంలు కావాలనే ఉద్దేశపూర్వకంగా ఆశా కార్యకర్తలను వేధిస్తున్నారని ఆరోపించారు. జాబ్ చార్ట్‌లో లేని పనులు చేయించుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా తిమ్మప్ప, పావని, మోష, మాధవి, లక్ష్మి, ఆంజనేయులు, రామాంజనేయులు, నర్సింహులు, సరస్వతమ్మ, వెంకటేష్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పేరు నర్సింహ, మండల కన్వీనర్ మేకల నర్సింహులు, దేవదాసు, ప్రవీణ్, గోవిందు, రాము, మోష, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



అలంపూర్ చౌరస్తాలో విరాళం అందజేస్తున్న ఏడీఈ మక్బూల్

అలంపూర్: అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి అలంపూర్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బూల్ గురువారం రూ. 25 వేల విరాళం అయ్యప్ప సేవా ట్రస్టు సభ్యులకు అందజేశారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో అయ్యప్పస్వామి నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు అయ్యప్ప సేవా ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అడిగిన తక్షణమే ఆలయ నిర్మాణానికి విరాళం ఇచ్చిన మక్బూల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు భాస్కర్‌రావు, ఉమామహేశ్వరయాదవ్, వీరేష్‌గౌడ్, గజేందర్ రమేష్, యుగంధర్ గౌడ్, తరుణ్, నరేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

ధరూరు: రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు మండల కేంద్రంలోని కొనుగోలు సెంటర్ వద్దకు చేరుకొని ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. సెంటర్‌కు 10 రోజుల నుంచి వడ్లు తెస్తున్నా.. కొనుగోళ్లను ప్రారంభించడం లేదని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. పగలంతా ఎండబెట్టుకుని రాత్రంతా ధాన్యానికి కాపలా ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోయారు. రెండు రోజులుగా వాతావరణం చల్లబడిందని, చిన్న చిన్న చిరు జల్లులు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడివి ఆంజనేయుల, మల్దకల్ క్రిష్ణ, వెంకటేష్, జయప్ప, వీరేష్ పాల్గొన్నారు.



ధరూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కేటీదొడ్డి: బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనేందుకు మండలంలోని పాతపాలెం పాఠశాలకు చెందిన విద్యార్థులు తరుణ్, రాఘవేంద్ర ఎంపికయ్యారు. విద్యార్థుల రవాణా ఖర్చుల నిమిత్తం నెట్‌సర్ఫ్ బయో కంపెనీ ప్రతినిధి కుమార్తె మనీషారెడ్డి ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున గురువారం అందించారు. ఈ సందర్భంగా మనీష మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రసేనారెడ్డి, పీఈటీ మోహన్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

2024 అథ్లెటిక్స్ జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ గురువారం గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించగా.. మండలంలోని నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పవిత్ర, రేవతి, అశ్విని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అమరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన వారికి డిసెంబర్ 1న మంచిర్యాల హైస్కూల్‌లో జరగబోయే 10వ తెలంగాణ అండర్ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. కుచినెర్ల గ్రామం నుంచి పరుగు పందెంలో భరత్‌కుమార్ 100 మీటర్ల ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



మానవపాడు: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన కమలమ్మకు మంజూరయిన రూ.60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును డీసీసీ జనరల్ సెక్రెటరీ మహ్మద్ సిరాజ్ బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, లింగేశ్వర్, శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణనపై ఎన్యుమరేటర్లకు శిక్షణ



రాజోళి: మండలంలో పశుగణన చేసేటప్పుడు సిబ్బందిగా పకడ్బందీగా వ్యవహరించాలని మండల పశు సంవర్ధక శాక అధికారి పుష్పలత అన్నారు. శుక్రవారం నుంచి 28 ఫిబ్రవరి 2025 వరకు జరిగే పశుగణనపై సిబ్బంది పక్కా ప్రణాళికతో పని చేయాలని సూచించారు. గురువారం వడ్డేపల్లి, రాజోళి మండలాల ఎన్యుమరేటర్లతో పశువుల గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఐడీ కార్డులు అందచేశారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. పాడి రైతులు సర్వేకు సహకరించి గణనలో పూర్తి వివరాలు తెలపాలని కోరారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న శ్యాంసుందర్

మల్దకల్: షుగర్, బీపీ ఉన్న రోగులకు వైద్యసిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్ వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో గుర్తించిన షుగర్ వ్యాధిగ్రస్తులకు సరైన వైద్యం అందించాలన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు క్రమం తప్పకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. డాక్టర్ స్వరూపరాణి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే విజయుడు
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



అలంపూర్ చౌరస్తాలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ : నియోజకవర్గ ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముభారక్, సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అయిజ మండలాలనికి చెందిన 276, ఇటిక్యాల మండలానికి చెందిన 24 మంది, ఎర్రవల్లి మండలాలకు చెందిన 19 మంది మొత్తం 319 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కుల విలువ రూ.3.19 కోట్లు ఉంటుందని తెలిపారు. అదేవిధంగా అయిజ, ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాలకు చెందిన 56 మందికి సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

జాతీయ సహకార వారోత్సవాలు



వారోత్సవాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అయిజ: జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో గురువారం 71వ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరించారు. అనంతరం సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార రంగం ద్వారానే రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒక సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందన్నారు. అదేవిధంగా నాబార్డ్ ఆధ్వర్యంలో రైతులకు వివిధ పథకాల ద్వారా నేరుగా లబ్ధి చేకూరే విధంగా పలు పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మల్లేష్, సిబ్బంది జీవన్, బీమార్జునరెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, విజయ్, రాజు, భక్త ప్రహ్లాద్, కళావతి పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేష్

అలంపూర్: విద్యార్థులు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని ఉండవెల్లి ఎస్‌ఐ మహేష్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ప్రయాగ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఉండవెల్లి పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ సమాజంలో జరుగుతున్న మార్పులపై దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉంటేనే నేరాలను అడ్డుకోవడం సాధ్యమన్నారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఎస్‌ఐ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

విద్యార్థులకు పలకల పంపిణీ



విద్యార్థులకు పలకలు అందచేస్తున్న చిరంజీవి అభిమానులు

రాజోళి: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చిరంజీవి ఫ్యాన్స్ మండల అధ్యక్షుడు శివరామయ్య ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పలకలు అందజేశారు. చిరంజీవి అభిమానుల తరఫున విద్యార్థులకు అన్ని రకాలుగా తోడుగా ఉంటామని వారు తెలిపారు. బాలల దినోత్సవం సందర్భంగా హాజరైన వారు విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో తమ అభిమాన సంఘం తరఫున సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ భగీరథరెడ్డి, ఖాద్రీ, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, వీరేష్, వహీద్, శాంతయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌పై శిక్షణ



మానవపాడులో మాట్లాడుతున్న డాక్టర్ సింధు

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం డాక్టర్ సింధు ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలకు, ఆశా కార్యకర్తలకు ఆర్‌ఐహెడ్ కౌంట్ సర్వేలెన్స్ మైక్రో యాక్షన్ ప్లాన్‌పై గర్భిణులు, చిన్నపిల్లలకు అన్ని రకాల వ్యాక్సినేషన్ ఇవ్వడంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంత మోతాదు వ్యాక్సిన్ అవసరం ఉంటుంది, ప్రణాళికలు ఎలా తయారు చేయాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో సాధారణ కాన్పులు చేయాలన్నారు. గర్భిణులకు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హెలెన్, చంద్రన్న, తిరుమల్‌రావు, సోని, ఏఎన్‌ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి



పచ్చర్లలో మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్

రాజోళి: గీత కార్మికుల శ్రేయస్సు కోసం గౌడ సంఘం తరఫున నిరంతరం పని చేస్తామని గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు పచ్చర్ల శ్రీధర్‌గౌడ్ అన్నారు. మండలంలోని పచ్చర్లలో ఆయన ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గౌడ్‌లు గీత వృత్తినే నమ్ముకుని నేటికీ దాన్నే జీవనోపాధిగా భావిస్తున్నారని, ఇలాంటి వారికి వృత్తిపై మరింత భరోసా లభించేలా అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు వెంకట్రాజగౌడ్, వెంకటేష్‌గౌడ్, రామన్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విత్తన పత్తి రైతులను ఆదుకోవాలి



తుమ్మలచెరువు శివారులో పత్తి పంటను పరిశీలిస్తున్న రంజిత్‌కుమార్

గట్టు: విత్తన పత్తి రైతుల దోపిడీని అరికట్టాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తుమ్మలచెరువు గ్రామంలోని రైతు బోయ గోవిందు పత్తి పొలాన్ని రంజిత్‌కుమార్ పరిశీలించారు. దశాబ్దాలుగా సీడ్ పత్తిని సాగు చేస్తున్న రైతులు మాత్రం అప్పులపాలు అవుతుంటే, కంపెనీలకు రైతులకు మధ్యవర్తులుగా ఉన్న ఆర్గనైజర్లు మాత్రం రూ.కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. శాంపిల్స్ తీసిన తర్వాత పాస్ అయితేనే మిగతా విత్తనాలను తీసుకెళ్లే వారని, ప్రస్తుతం విత్తన పత్తిని మొత్తం తీసుకెళ్లి ఫెయిల్ కాకున్న అయినట్లుగా చెబుతూ రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పెట్టుబడులు పెరుగుతున్నా, విత్తన ప్యాకెట్ల ధరలను పెంచడం లేదని అసహనం వ్యక్తం చేశారు. రైతులు దోపిడికి గురవుతున్న విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే రైతులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, నాయకులు శ్రీనివాస్ యయాదవ్, ప్రేమ్‌రాజ్, అంజి, నర్సింహులు, జంగిలప్ప, గోవిందు, ఉలిగప్ప, పరమేష్, నరేష్, దానప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.